క్లుప్తంగా

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలి

కొత్తపట్నం: కౌంటింగ్ పూర్తయ్యే వరకు గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలని ఎస్సై బి.సాంబశివరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు అక్కడక్కడ చిన్నపాటి గొడవలు పెట్టుకుంటున్నారని, వాటి వల్లే మీకు అనర్థాలు జరుగుతాయన్నారు. ఎన్నికల గురించి ఎక్కడా చర్చలు పెట్టవద్దని, దీని వల్ల ఎన్నో గొడవలు జరుగుతాయన్నారు. గ్రూపులుగా ఒక చోట చేరి వాదోపవాదాలు పెట్టుకోవద్దని సూచించారు. అనుమానితులను బైండవర్ చేస్తామని తెలిపారు. కార్డర్ సెర్చ్‌లో ఎటువంటి పత్రాలు లేని ద్విచక్రవాహనాలను సీజ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. బెట్టింగ్‌లు పెట్టి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గ్రామాల్లో ఎక్కడైనా హింసాత్మక ఘటనలు జరుగుతుంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

టీబీ రాకుండా టీకా వేయించుకోవాలి

ఉలవపాడు: టీబీ రాకుండా ప్రతి ఒక్కరూ టీకా వేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద అన్నారు. మండల పరిధిలో మన్నేటికోట, ఆత్మకూరు, కరేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో జరుగుతున్న అడల్ట్ బీసీజీ వాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం ఆమె పరిశీలించారు. టీబీ వ్యాధి రాకుండా ముందస్తుగా ఈ టీకా వేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు కలిగినటువంటి వారు 16 ఏండ్ల దాటిన వారు అందరూ ఈ టీకా వేయించుకోవాలని సూచించారు. టీకా గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అన్ని సచివాలయాల పరిధిలో ప్రతి గురువారం ఈ టీకా వేస్తామన్నారు. అనంతరం కరేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం రికార్డులు పరిశీలించారు. వైద్యాధికారి రమ్యజ్యోతి, ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మీనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మా చెల్లి ఆచూకీ చూపించండయ్యా..

పీసీపల్లి: మా చెల్లి ఆచూకీ చూపించండయ్యా వెంగళాపురం గ్రామానికి చెందిన గుర్రం బ్రహ్మయ్య, పేరయ్యలు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే..వెంగళాపురానికి చెందిన నోసిన చెంచమ్మ(35) గత నెల 11 నుంచి కనిపించడం లేదు. దీంతో ఆమె సోదరులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఫిర్యాదులో చెంచమ్మ భర్త శ్రీను, మామయ్య నారాయణలపై అనుమానం వ్యక్తం చేశారు. అయితే పోలీసులు ఎటువంటి విచారణ చేయకుండా కాలయాపన చేస్తున్నారని వాపోతున్నారు. పోలీసులు స్పందించి చెంచమ్మ ఆచూకీ తెలుసుకోవాలని కోరుతున్నారు.

నేడు ఊళ్లపాలెంలో కోదండ రామ కళ్యాణోత్సవం



ఊళ్లపాలెంలోని కోదండరామస్వామి ఆలయం

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెంలో కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ కేవీ ప్రసాద్ తెలిపారు. కళ్యాణోత్సవ కార్యక్రమానికి ఉభయదాతలుగా ప్రముఖ వ్యాపారవేత్త పులగర నారాయణరావు, చంద్రకళ దంపతులు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఒంగోలు ఏసీ కార్యాలయ అధికారి శ్యాంసుందర్ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఉత్సవాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించాలని పోలీసు శాఖను కోరినట్లు తెలిపారు.

ఉపాధి హామీ పనులు తనిఖీ

పొన్నలూరు: మండంలోని బోగనంపాడు పంచాయతీ పరుచూరివారిపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులను ఏపీఓ మాచర్ల గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల పనితనం, మస్టర్ రోల్‌ను పరిశీలించారు. ఉదయం పూట పనిచేయడం కుదరని కూలీలు, మధ్యాహ్నం తరువాత అయినా ఉపాధి పనులకు వెళ్లవచ్చని చెప్పారు. మస్టర్ రోల్‌లో అవకతవకలు చేస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.

మండే ఎండ.. జాగ్రత్తలే అండ



ఎండలు మండుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేడి భానుడు ప్రతాపం చూపుతున్నారు. ఎండ నుంచి రక్షణకు మనం ఎలా జాగ్రత్తలు పాటిస్తామో .. వాహనాలను సైతం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. వాహనాలు ఎండలో గంటల సమయం ఉండటంతో వాటి రంగు వెలసిపోతోంది. పెట్రోల్ సైతం ఆవిరి అయ్యే అవకాశం ఉందని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. వాహనాలకు ట్యాంక్ నిండా పెట్రోలు పట్టిస్తే ఒక్కోసారి పేలే ప్రమాదం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు. – ఒంగోలు సెంట్రల్

ద్విచక్రవాహనాల రక్షణ ఇలా...

- వాహనాలను ఎక్కువ సేపు పార్కింగ్ చేయా ల్సి వస్తే చెట్టు నీడన గానీ, షెడ్లలో గానీ పెట్టుకోవాలి. లేదా కవర్లు కప్పి ఉంచాలి.
- ఎండ వేడిమి రంగు వెలసిపోయి కొత్త వాహనాలు సైతం పాతవిగా కనిపిస్తాయి. అధిక ఉష్ణోగ్రతలతో టైర్లలో గాలి తగ్గిపోతుంది.
- వారానికి ఒక సారి గాలి తనిఖీ చేయించుకోవడం మంచిది.
- గాలి ఎక్కువ కొట్టించడం వల్ల వేడికి టైర్లు కరిగి పేలిపోతాయి. తగిన మోతాదులో మాత్రమే గాలి నింపుకోవాలి.
- ద్విచక్ర వాహనాలు ఎక్కువ సమయం ఎండలో ఉంచితే పెట్రోల్ ఆవిరై పోయే అవకాశం ఉంది.
- వేసవిలో పగలు కన్నా సాయంత్రం వేళల్లో పెట్రోల్ కొట్టించడం మంచిది.
- గాలి పట్టే విషయంలో ఆలసత్వం ప్రదర్శిస్తే టైర్ల మన్నిక తగ్గిపోతుంది. తద్వారా పెట్రోల్ ఎక్కువ ఖర్చయ్యే ప్రమాదం ఉంది.
- వేసవిలో ద్విచక్ర వాహనాలపై దూర ప్రయాణం చేయడం తగ్గించుకుంటే మేలు .
- దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు వాహనాల వేగానికి ఉష్ణోగ్రతల వేడికి ఇంజన్ రెండింతలు వెడెక్కే అవకాశం ఉంటుంది. అందువల్ల కొంత దూరం ప్రయాణం చేసిన తర్వాత ఇంజన్ కాసేపు ఆపుకుంటే వాహనం మన్నిక కాలం పెరుగుతుది. నిర్ణీత గడువు లోగా ఇంజన్ ఆయిల్ చెక్ చేసుకోవాలి.

పెద్ద వాహనాలు ఇలా....

- కార్లు, లారీలు ఇతర భారీ వాహనాల విషయంలో రేడియేటర్లలో నీళ్లను తరచూ తనిఖీ చేసుకోవాలి.
- నీళ్ల కంటే కూలెంట్ ఆయిల్ వాడటం మంచిది.
- వేడికి ఇంజన్ ఆయిల్ తగ్గే అవకాశాలు ఉంటాయి. తప్పనిసరిగా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి.
- కార్లలో పెట్రోల్, డీజిల్‌తో పాటు ఎల్‌పీజీ గ్యాస్ ద్వారా వాహనాల నడిపే వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. అటువంటి వాహనదారులు వేసవిలో గ్యాస్ కిట్‌ను ఉపయోగించకుండా ఉంటే ఉత్తమం.
- ఏసీ నిలబడాలంటే కారు అద్దాలకు క్లాత్ మ్యాట్స్ ఏర్పాటు ఏర్పాటు చేసుకోవాలి.

ఎండాకాలం వెళ్లే వరకు భారీ వాహనాలకు నూతన టైర్లు వాడితే మేలు. లేదంటే దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పాత టైర్లలో గాలి తగ్గి. పేలే ప్రమాదం ఉంది.

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ



శ్రీగిరి గిరి ప్రదక్షిణలో కాలభైరవ ఉపాసకులు, భక్తులు

ఒంగోలు మెట్రో: వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని శ్రీగిరి సేవా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కొండమీద వెంకటేశ్వరస్వామి శ్రీగిరి, స్కందగిరి ప్రదక్షిణ శోభాయమానంగా, భక్తిశ్రద్ధలతో సాగింది. శ్రీగిరి పాద పీఠం వద్ద ఉన్న గో సంఘం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్థానిక కేశవస్వామిపేట, శర్మాకళాశాల, గద్దలగుంట, రాజాపానగల్ వీధుల గుండా శ్రీగిరి వెంకటేశ్వరుని దర్శించి అనంతరం స్కందగిరి సుబ్రమణ్యేశ్వరుని దర్శించారు. కార్యక్రమానికి ముందుగా గోశాలలో గోపూజ చేశారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై గంగా సమేత పార్వతి పరమేశ్వరుల ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి మేళతాళాల మధ్య గోవింద నామస్మరణ చేస్తూ శంఖు, చక్ర, గరుత్మంత, హనుమంత, త్రిపుండ్రాలను చేతబట్టి గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి మాట్లాడుతూ పౌర్ణమి పున్నమి వెలుగులో భక్తులంతా కలసి సామూహికంగా గిరిప్రదక్షిణలో పాల్గొనడం శుభ సూచికమన్నారు.

ఆలయాల్లో పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



లక్ష మల్లెల పూజలో దత్తాత్రేయస్వామి వారు

- భక్తిశ్రద్ధలతో చండీహోమాలు

ఒంగోలు మెట్రో: వైశాఖ పౌర్ణమి గురువారం సందర్భంగా నగరంలోని అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్థానిక బాలాజీరావుపేట పోలేరమ్మ కనకదుర్గమ్మ దేవస్థానంలో, రంగారాయుడు చెరువు దగ్గర శంకరమఠంలోని కంచి కామాక్షమ్మ వారికి, గద్దలగుంటలోని మహాలక్ష్మి, మహా సరస్వతి, రాజరాజేశ్వరి దేవస్థానంలో, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో, సమతానగర్లోని సాగర్ కాలవ దగ్గర వెలసియున్న కనకదుర్గ అమ్మవారికి, గంటపాలెంలోని పార్వతీ అమ్మవారికి, స్థానిక కేశవస్వామిపేటలోని విజయ దుర్గ అమ్మవారికి, ప్రసన్న చెన్నకేశవస్వామి వారి ఆలయంలో రాజలక్ష్మి అమ్మవారికి, శ్రీ లలిత ఆశ్రమంలోని లలిత అమ్మవారికి, సంతపేట షిర్డీ సాయిబాబా మందిరంలోని నాగలక్ష్మి అమ్మవారికి, లాయర్పేట షిరిడి సాయి బాబా మందిరములోని రాజరాజేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చక స్వాములు ఉదయం ఏడు గంటలకు అమ్మవారి మూలవిరాట్కు పంచామృత అభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి చక్రానికి, కుంకుమతో దేవి ఖడ్గమాలతో పూజలు చేశారు. అనంతరం ధూప, దీప, నైవేద్యంతో అమ్మవారికి మంగళహారతులు ఇచ్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంగమూరురోడ్డు మిలిటరీ కాలనీలోని కనకదుర్గమ్మ దేవాలయంలో అర్చక స్వామి రాము శర్మ చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

శాంతిభద్రతల కోసమే కార్డన్ సెర్చ్



మహిళలకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై, మహిళా పోలీసులు



సరైన పత్రాలు లేని బైకును తీసుకెళ్తున్న సీఐ, ఎస్సై, పోలీసులు

- సరైన పత్రాలు లేని 35 వాహనాలు స్వాధీనం
- హిస్టరీ షీటర్స్‌కు కౌన్సిలింగ్, రాత్రులు పల్లెనిద్రలో పోలీసులు
- ఓట్ల లెక్కింపు తర్వాత కూడా కొనసాగనున్న కార్డన్ సెర్చ్

చీమకుర్తి: చీమకుర్తి పట్టణంతో పాటు గ్రామాల్లో పోలీసులు నిర్వహిస్తున్న కార్డన్ సెర్చ్ ప్రజలను హడలెత్తిస్తోంది. ఈ నెల 20 నుంచి మొదలైన కార్డన్ సెర్చ్‌లో ఇప్పటి వరకు సరైన పత్రాలు లేనటువంటి 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక ఎస్సై యూవీ కృష్ణయ్యతో పాటు పోలీసులు, మహిళా పోలీసుల ఆధ్వర్యంలో గురువారం చీమకుర్తిలోని నెహ్రూనగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇప్పటి వరకు నాయుడుపాలెం, పాటిమీదపాలెం, సూర్యనగర్, గరికమిట్ట ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల అనంతరం పరిస్థితులు ప్రశాంతంగా నెలకొల్పేందుకు, ఓట్ల లెక్కింపు, అనంతరం శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. అందులో భాగంగా పోలీస్‌స్టేషన్లలో హిస్టరీ షీటర్స్‌గా నమోదైన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. గ్రామాల్లో ఓట్ల లెక్కింపు అనంతరం అల్లర్లు చెలరేగకుండా ఉండేందుకు మహిళలకు కూడా మహిళా పోలీసులతో కౌన్సిలింగ్ ఇస్తున్నారు. గ్రామాల్లో రాత్రులు ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు పల్లె నిద్ర కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. కార్డన్ సెర్చ్ ఓట్ల లెక్కింపు అనంతరం కూడా కొనసాగనున్నట్లు తెలిపారు.



హిస్టరీ షీటర్స్‌కు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై



స్వాధీనం చేసుకున్న పత్రాలు లేని వాహనాలతో పోలీసులు

కొండవాగుల ఆక్రమణదారులపై చర్యలు



వాగు ఆక్రమణలను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని నాగులచెరువుకు సంబంధించిన కొండపై నుంచి వచ్చే నీటి ప్రవాహిక వాగులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. నాగులచెరువు పరివాహక ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధానంగా నీటి వనరుగా ఉన్న నాగుల చెరువులోకి నీరు చేరకుండా, క్వారీ యజమానులు, గ్రానైట్ కంపెనీలు, రియల్టర్ వ్యాపారులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా మండిపడ్డారు. వ్యాపారులు తమ స్వార్థం కోసం కొండవాగు నీటిని నాగుల చెరువులోకి చేరకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. దీని ప్రభావంతో చెరువులో నీరు లేక పట్టణంలోని భూగర్భ జలాలన్ని ఎండిపోతున్నాయన్నారు. వర్షాలు కురిసినప్పడు నీరు చెరువులోకి చేరితేనే పట్టణంలోని బోర్లల్లో, బావుల్లో నీరు సంవృద్ధిగా ఏడాది పాటు ఉంటాయని తెలిపారు. కొండవాగు నీరు రాకుండా అడ్డుకోవడం వల్లే పట్టణానికి నీటి ముప్పు ఏర్పడిందన్నారు. ఆక్రమణదారులు తక్షణం కొండవాగు ప్రాంతాల్లోని కట్టడాలను, ఆక్రమణలను, క్వారీ రాళ్లను తొలగించాలన్నారు. లేకుంటే వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి పూర్తి స్థాయి ప్రక్షాళన చర్యలు చేపడతానని చైర్మన్ గఫార్ హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, నాయకులు పెన్నా ఏడుకొండలు, పసుపులేటి అరుణోధర్, కంటు గరవయ్య, చిన్నిగారి కొండలు, ఎస్‌కే మన్సూర్ తదితరులున్నారు.

ఘనంగా అన్నమాచార్య జయంతి వేడుకలు



అన్నమయ్య జయంతి వేడుకల్లో పాల్గొన్న రచయితలు కవులు, సాహిత్యవేత్తలు

ఒంగోలు మెట్రో: తాళ్లపాక అన్నమాచార్య సంగీత సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్య జయంతి వేడుకలు గురువారం స్థానిక సంతపేట షిర్డీ సాయి బాబా మందిరంలో కొలువై ఉన్న అన్నమయ్య విగ్రహం వద్ద వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు ఐ. మురళీ కృష్ణ మాట్లాడుతూ కలియుగ దైవమైన వెంకటేశ్వరునిపై రచించిన సంకీర్తనల ద్వారా ప్రజల నైతిక భావాల పెంపునకు, తెలుగు భాషాభివృద్ధికి, సామాజిక దార్శనికతకు నిలువుటద్దం గా నిలిచాయని పేర్కొన్నారు. ప్ర.ర.సం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు ఆధ్యాత్మిక రంగాన్ని సుసంపన్నం చేశాయని తెలిపారు. ఆధ్యాత్మిక రంగాన అన్నమయ్య ఎవరెస్ట్ శిఖరమన్నారు. సమితి ఉపాధ్యక్షురాలు కె.త్రిపుర సుందరి మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు ప్రచారానికి త్వరలో ఉచిత సంకీర్తన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు సుధాకర్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక విశేష పూజలు, సామూహిక సంకీర్తన గళార్చన, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సాయి మందిర నిర్వాహకులు అళహరి చెంచలరావు, జిల్లా విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, ట్రాక్ స్టార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మా మూర్తి, ఎర్రన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, ప్రముఖ వైద్యులు రావిపాటి ప్రసాదరావు, పి. జానకిరాం, ఓపీ ప్రసాద్, ఎం. నాగేశ్వరరావు, గుర్రం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గంగ తిరునాళ్ల



తిరునాళ్లకు సిద్ధం చేసిన ఆలయం



ఆలయంలోని గంగమ్మ తల్లి మూల విరాట్



పాలేటి నదిపై వెలసిన అమ్మవారు

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాపురం పాలేటి గంగ ఒడ్డున వెలసిన గంగమ్మ తిరునాళ్ల శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు పోలీసుల అనుమతి లేదన్నారు. జిల్లాలో గంగ తిరునాళ్లకు మంచి గుర్తింపు ఉంది. అమ్మవారు ఎంతో మహిళకలది కావడంతో తిరునాళ్లలో మొక్కులు తీర్చుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి కోదండరామస్వామి తిరునాళ్ల



కోదండరామస్వామి మూల విగ్రహమూర్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీపేటలో శనివారం నుంచి 3 రోజుల పాటు కోదండరామస్వామి తిరునాళ్ల నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గురువారం తెలిపింది. శనివారం గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, స్నపనతిరుమంజసేవ, అంకురార్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆదివారం స్వామి శాంతి కల్యాణో త్సవం, గ్రామోత్సవం, సోమవారం ఉదయం వసంతోత్సవం, వనమహోత్సవం, సాయంత్రం పారువేట, ఉత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయాన్ని సుందరంగా ప్రత్యేక విద్యుద్దీపాలతో అలంకరించారు.